సాక్షి జగిత్యాల

బుధవారం । 7 । జూన్ । 2023



పోటెత్తిన భక్తులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకున్నారు.



అన్ని రంగాల్లో ప్రగతి

జగిత్యాల: జిల్లా పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లోనూ ప్రగతి సాధించిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.0/29.0

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండతీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

వైద్య సేవలకు సలాం



కథలాపూర్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ అధికారులు(ఫైల్)

సమష్టి కృషికి నిదర్శనం



అధికారులు, వైద్యసిబ్బంది సమిష్టి కృషితో కథలాపూర్ పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ అవార్డు దక్కింది. ఎన్‌క్వాస్ అవార్డు దక్కడంతో మాపై మరింత బాధ్యత పెరిగింది. పీహెచ్‌సీలో పేషెంట్లకు మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రజాప్రతినిధుల, ఉన్నతాధికారుల సహకారం మరవలేనిది.

– సింధూజ, వైద్యాధికారి, పీహెచ్‌సీ, కథలాపూర్

ఏటా రూ.3 లక్షలు..

- కేంద్ర ప్రభుత్వ అందించే ఎన్‌క్వాస్ అవార్డు కింద ఏటా రూ.3 లక్షలు కథలాపూర్, కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందుతాయి.
- ఆత్మకూర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు ఏటా రూ.లక్ష వస్తాయి.
- ఇలా మూడేళ్లపాటు పీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్‌కు నిధులు అందనున్నాయి.
- ఈ నిధులను పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.
- పీహెచ్‌సీల అభివృద్ధికి వచ్చే సాధారణ నిధులతోపాటు అదనంగా ఎన్‌క్వాస్ నిధులు రావడంతో మరింత అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని భావిస్తున్నారు.

- పచ్చదనం, పరిశుభ్రత, ఆహ్లాద వాతావరణానికి కితాబు
- ఎన్‌క్వాస్ అవార్డుకు కథలాపూర్, కొడిమ్యాల పీహెచ్‌సీలు ఎంపిక
- మెట్‌పల్లిలోని ఆత్మకూర్ వెల్‌నెస్ సెంటర్‌కూ అవార్డు
- ఏటా రూ.3 లక్షల చొప్పున మూడేళ్లపాటు సాయం
- కథలాపూర్ పీహెచ్‌సీకి రెండోసారి పురస్కారం

కథలాపూర్(వేములవాడ): స్వచ్ఛత, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న జిల్లాలోని మూడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు జాతీయ పురస్కారాలు సొంతం చేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు అధిగమిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించి కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) అవార్డుకు ఎంపికయ్యాయి. ఇందులో కథలాపూర్, కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ పీహెచ్‌సీ పరిధిలోని ఆత్మకూరు హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఉన్నాయి. కథలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి జాతీయ పురస్కారాలకు ఎంపిక కావడం విశేషం.

ఎన్‌క్వాస్ బృందాల సందర్శన..

- కేంద్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అందించే అత్యుత్తమ పురస్కారానికి ఎంపిక చేసేందుకు ఎన్‌క్వాస్ అధికారులు ఏప్రిల్ 25, 26 తేదీల్లో కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని రెండురోజులపాటు పరిశీలించారు.
- గతనెల 10న మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు.
- అదేనెల 15, 16 తేదీల్లో రోజూ సుమారు 12 నుంచి 14 గంటలపాటు కథలాపూర్ పీహెచ్‌సీలో సౌకర్యాలపై ఆరా తీశారు.
- ఎంతమంది వైద్యం కోసం వస్తున్నారు, వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌ల వసతి ఉందా, పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రత, పచ్చదనం లాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించారు.

అవార్డుకు ఆరు అంశాలే ప్రామాణికం..

- జాతీయ ఆరోగ్య మిషన్ జారీచేసిన ఆరు అంశాలను ప్రామాణికంగా తీసుకొని పీహెచ్‌సీలను జాతీయ పురస్కాలకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీకి ఎంతమంది పేషెంట్లు వస్తున్నారు?, ఇన్ పేషెంట్లకు అందిస్తున్న సేవలు, ల్యాబ్‌లు, మందులు అందిస్తున్న తీరు, నిల్వలు, మాతాశిశు సేవలు, ప్రసవాల గది, హరితహారం, జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, మెడికల్ వ్యర్థాల నిర్వహణ పరిశీలించి మార్కులు ఇస్తారు. వందకు 70 మార్కులకుపైగా వచ్చిన ఆరోగ్యకేంద్రాలకు అవార్డు దక్కనుంది. కథలాపూర్ పీహెచ్‌సీకి 95.02 మార్కులు కేటాయించారు. కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి 77.76 మార్కులు వచ్చాయి. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు 84 మార్కులు వేశారు. ఈ మేరకు అధికారులు మంగళవారం ఆరోగ్యకేంద్రాలకు వచ్చిన మార్కుల ఉత్తర్వులు జారీచేశారు. ఈ మార్కుల ఆధారంగా జాతీయ పురస్కారానికి కథలాపూర్, కొడిమ్యాల పీహెచ్‌సీతోపాటు ఆత్మకూర్ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

వందేభారత్ వచ్చేస్తోంది!

- రెండోసారి ట్రయల్స్ పూర్తిచేసుకున్న రైలు
- త్వరలోనే ఖాజీపేట – బల్లార్ష మార్గంలో పరుగులు
- మూడో సర్వీసుగా నాగ్‌పూర్ – సికింద్రాబాద్ రైలు
- పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్?
- ఉమ్మడి జిల్లాలో 100 కి.మీ. వేగంతో పరుగులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పూర్తిస్వదేశీ సాంకేతికతతో రూపొందిన సూపర్‌ఫాస్ట్ ట్రెయిన్ వందేభారత్ ఉమ్మడి జిల్లాలో కూత పెట్టనుంది. ఈనెలలో నాగపూర్ – సికింద్రాబాద్ మధ్య రైలు ప్రారంభానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ఈరైలు రెండుసార్లు ట్రయల్ రన్ పూర్తిచేసుకుంది. సోమవారం కూడా రైలు ఎక్కడా ఆపకుండా సికింద్రాబాద్ – నాగపూర్ వరకు 100 కి.మీ. వేగంతో నడిపినట్లు తెలిసింది. మే నెలలో తొలిసారి వందేభారత్ రైలును ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ట్రయల్ రన్ చేపట్టగా సకాలంలో గమ్యస్థానం చేరుకుందని సమాచారం. ప్రస్తుతం సికింద్రాబాద్ – విశాఖపట్నం, సికింద్రాబాద్ – తిరుపతి రూట్లలో వందేభారత్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా సికింద్రాబాద్ – నాగపూర్ రూట్‌లో పరుగుతో రికార్డునెక్కనుంది.

రామగుండం, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్?

అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన వందేభారత్ రైలు.. సికింద్రాబాద్ – ఖాజీపేట, ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో త్వరలో పరుగులు తీయనుంది. ఇటీవలే ఈ సెక్షన్‌లో మూడోలైన్ కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరిగింది. ఇదే సెక్షన్ మీదుగా వందేభారత్‌ను సికింద్రాబాద్ టు నాగపూర్ వరకు ట్రయల్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ – నాగపూర్ వరకు 581 కిలో మీటర్లు. సాధారణ రైళ్లకైతే ఈ రెండు నగరాల మధ్య 10 గంటలకుపైగా సమయం పడుతోంది. వందేభారత్ రైలైతే 6.30 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకునే వీలుంది. మొన్న జరిగిన పరీక్షల్లో రైలు కేవలం ఆరుగంటల్లోనే చేరుకుందని సమాచారం. మిగిలిన అరగంటలో హాల్టింగ్‌ల సమయాన్ని తీసేసినా.. ఆరున్నర గంటల్లో చేరుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెద్దపల్లి, రామగుండం, ఉమ్మడి ఆదిలాబాద్‌లో మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇందులో మార్పులు కూడా ఉండవచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

రూట్	స్పీడు సామర్థ్యం(కి.మీ.లలో)
సికింద్రాబాద్ – బల్లార్షా	130
ఖాజీపేట – కొండపల్లి	130
సికింద్రాబాద్ – ఖాజీపేట	130
మానిక్‌నగర్ – విరూర్(3వ లైన్)	110
మందమర్రి – మంచిర్యాల(3వ లైన్)	110
మంచిర్యాల – పెద్దంపేట(3వ లైన్)	100
పెద్దంపేట – రాఘవపురం(3వ లైన్)	110
రాఘవపురం – కొలనూరు – పొత్కపల్లి(3వలైన్)	90
బిజిగిరీషరీఫ్ – ఉప్పల్(3వ లైన్)	100
పెద్దపల్లి – కరీంనగర్	100
కరీంనగర్ – జగిత్యాల(లింగంపేట)	90
జగిత్యాల(లింగంపేట) – నిజామాబాద్	100
మేడ్చల్ – మనోహరాబాద్ సెక్షన్	110

జగిత్యాల రూట్‌లో నడపాలి



జగిత్యాల రూట్‌లో చాలామంది ఎక్స్‌ప్రెస్ సర్వీసు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్దపల్లి – జగిత్యాల మార్గంలో వందేభారత్ రైలు నడిపితే ముంబై వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుంది. ఇప్పుడు 10 గంటల సమయం పడుతుంది. రూ.2 వేల ఖర్చవుతుంది. వందేభారత్ వస్తే.. వేగంగా ముంబై చేరుకుంటాం, ఖర్చు తగ్గుతుంది.

– నాగిరెడ్డి రాజిరెడ్డి, హార్వెస్టర్ యజమాని, జగిత్యాల

పెద్దపల్లిలో హాల్టింగ్ ఇవ్వాలి



ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో వందేభారత్ రైలు రానుండటం హర్షణీయం. దీంతో స్థానికులకు చాలామేలు జరుగుతుంది. పెద్దపల్లిలో హాల్టింగ్ ఉంటుందన్న ప్రచారంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లికి హాల్టింగ్ కల్పిస్తే నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ వాసులకు అనుకూలంగా ఉంటుంది.

– కొండి సతీశ్, ఆమ్ ఆద్మీ పార్టీ

ట్రాక్‌ల సామర్థ్యం పెంపు

రైలు పరుగుపెట్టనున్న నాందేడ్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ట్రాక్‌స్పీడ్ పెంచారు. సికింద్రాబాద్ పరిధిలో ఖాజీపేట – బల్లార్ష రూట్‌ను అప్‌గ్రేడ్ చేశారు. దాదాపు 130 కి.మీ. వేగంతో ఈ మార్గంలో రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట – రామగుండం వరకు, పెద్దపల్లి – మెట్‌పల్లి వరకు కనిష్ఠంగా 90 కి.మీ. నుంచి గరిష్ఠంగా 130 కి.మీ. వరకు వేగంగా వెళ్లేలా ట్రాక్‌లు రెడీ చేశారు. భవిష్యత్తులో వందేభారత్ రైలును పెద్దపల్లి – కరీంనగర్, కరీంనగర్ – జగిత్యాల, జగిత్యాల – నిజామాబాద్ రూట్లలోనూ నడపగలిగితే.. పొరుగున ఉన్న మహారాష్ట్రకు కేవలం మూడు, నాలుగు గంటల్లోనే చేరుకునే వీలుంటుంది. సిరిసిల్ల, జగిత్యాల విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు, నేత, వలస కార్మికులకు ఇది ఎంతో అనువుగా ఉండనుంది.

ఈదురుగాలుల బీభత్సం



కోరుట్ల – మెట్‌పల్లి జాతీయ రహదారిపై విరిగిపడ్డ చెట్టు



రాఘవపేటలో కూలిన ఇంటి పైకప్పు, విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

కోరుట్ల: జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వాటి ధాటికి చెట్లు విరిగి రోడ్లపై పడిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లుల కురవడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కోరుట్లశివారులోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ సమీపంలో కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారిపై వేపచెట్టు విరిగి పడింది. ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు జేసీబీ సాయంతో తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. వేములవాడ రోడ్డు హనుమాన్ ఆలయంలోని రావిచెట్టు నేలకూలింది. టీచర్స్ క్లబ్ రోడ్డు వీధిలో వేపచెట్టు కూలింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కరెంట్ తీగలు తెగిపడడంతో ట్రాన్స్‌కో సిబ్బంది రెండు గంటల్లో పునరుద్ధరించారు.

వెంకట్రావుపేటలో..

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం వెంకట్రావుపేట రైతువేదిక పైకప్పు రేకులు లేచిపోయాయి. పలువురి ఇళ్లపై రేకులు కొట్టుకుపోయాయి. ఈదురుగాలులతో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. రాఘవపేటలో చెట్లు విరిగిపడడతంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంటిపైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: వెనుకబడిన తరగతుల కుల వృత్తులు, చేతివృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష సాయం చేసేందుకు నిర్ణయం తీసుకుందని, ఇందుకోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. బీసీ కుల చేతివృత్తుల వారు ఆన్‌లైన్ వెబ్‌సైట్ tsobmmsbc.cgg.gov.in లో ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లనుంచి 55ఏళ్ల వయసు లోపు వారు అర్హులన్నారు. గత ఐదేళ్లలో ఆర్థికసాయం, లబ్ధిపొందిన వారు అనర్హులని పేర్కొన్నారు.

గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు

జగిత్యాల: జిల్లాలో ఈనెల 11న నిర్వహించే గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె మంగళవారం మాట్లాడారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

నిర్మాణాలు చేపడితే చర్యలు



ఇంటిని సీజ్ చేస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: దేవాలయ భూముల్లో అక్రమంగా కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని ఆ శాఖ ఈవో వేణుగోపాల్ హెచ్చరించారు. స్థానిక శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం ధర్మశాల సర్వే నంబరు 170లో అక్రమంగా చేపట్టిన కట్టడాలను జగిత్యాల డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రవికిషన్ ఆధ్వర్యంలో మంగళవారం కూల్చివేశారు. ఆయన మాట్లాడుతూ, ఆలయ భూముల్లో ఎవరు కూడా నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూల్చివేత సమయంలో కొందరు మహిళలు అడ్డుపడగా సామగ్రి ఖాళీ చేయించి ఇంటిని సీజ్ చేశారు. కార్యనిర్వాహక అధికారులు సదయ్య, మారుతి, కాంతరెడ్డి, కరీంనగర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాసీ బీమా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న గుగ్గిళ్ల రవిగౌడ్

రాయికల్(జగిత్యాల): గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులు ప్రవాసీ బీమా సౌకర్యం చేయించుకున్నాకే విమానాలు ఎక్కాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్ సూచించారు. అల్లీపూర్‌లో గల్ఫ్ వలసలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.10 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని, లైసెన్స్ ఉన్న ఏజెంట్లను మాత్రమే నమ్మాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, జేఏసీ నాయకులు బొడ్డుపల్లి రాము, ఎలుముల భూమయ్య, దండవేని అశోక్, తిరుపతి, పోశాలు, గొల్లపల్లి నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు న్యాయం చేయాలి

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కేజీబీవీ ఉపాధ్యాయ పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కథలాపూర్ కేజీబీవీలోని ఇంగ్లిష్ సీఆర్టీ మ్యూచువల్ బదిలీ ద్వారా కరీంనగర్ జిల్లా ఎల్కతుర్తికి బదిలీ చేసుకున్నారని, కానీ ట్రయాంగిల్ ఎగ్జిస్టింగ్ బదిలీ పేరిట బదిలీలు చేయడం ద్వారా మ్యూచువల్ బదిలీకి అంగీకరించిన వారికి మరోచోట పోస్టింగ్ వస్తోందన్నారు. దీంతో చాలాకాలంగా బదిలీ కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయురాలికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. బదిలీల్లో నష్టపోయిన ఉపాధ్యాయురాలికి కరీంనగర్ జిల్లాలోని మరో పాఠశాలకు బదిలీ చేయాలని కోరారు.

వడదెబ్బతో యువకుడి మృతి



రాజు(ఫైల్)

జగిత్యాలక్రైం: పట్టణ శివారు టీఆర్‌నగర్ గ్రామంలోని పాలెటి రాజు(26) వడదెబ్బతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. రాజు.. జగిత్యాలలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం తీవ్ర అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అందరికీ అందని 'వసతి'

- వంద మందికే హాస్టల్ సౌకర్యం
- మిగతా వారికి తప్పని తిప్పలు
- ఆదర్శ పాఠశాలల్లో దుస్థితి



పెగడపల్లి మోడల్ స్కూల్

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలోని మోడల్ స్కూళ్లలో చదువుకునే సుదూరంలోని చాలామంది విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం అందడంలేదు. దీంతో రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంగ్లిష్ మీడియంతో కూడిన ఆదర్శ పాఠశాలలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2013లో ప్రారంభించాయి. నిష్ణాతులైన అధ్యాపకులను నియమించాయి. ఇంగ్లిష్‌కు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వీటిలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. కానీ, వసతులేమి సమస్యగా మారింది.

ఒక్కో స్కూల్‌లో వంద మందికే..

- ఆదర్శ పాఠశాలల్లో తొలుత అందరికీ వసతి కల్పిస్తామని అధికారులు ప్రకటించారు.
- ఒక్కోచోట వంద మంది విద్యార్థినులకు మాత్రమే ఇప్పటివరకు వసతి సౌకర్యం కల్పించారు.
- మిగతా విద్యార్థులు ఏరోజుకారోజు ఇళ్లకు వెళ్లి రావాల్సి వస్తోంది.
- ఇంగ్లిష్ మీడియం కావడం, నిష్ణాతులైన బోధకులు ఉండటంతో ఎక్కువ మంది వీటిలో సీట్లు సంపాదించాలని తపన పడుతుంటారు.
- సుదూర ప్రాంతాల విద్యార్థులూ ఇందులో ప్రవేశాలు పొందుతున్నారు.
- అందుబాటులో బాలికలు, బాలురకు వసతి గృహాలు లేక అవస్థలు పాలవుతున్నారు.
- పెగడపల్లిలో బాలుర ఎస్సీ, బీసీ వసతి గృహాలు ఉన్నాయి.
- ఇక్కడి ఆదర్శ పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇందులో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- బీసీ విద్యార్థులకు సీట్లు పరిమితంగా ఉండటంతో అత్యధిక మందికి నిరాశే ఎదురవుతోంది.
- ఒక్కో పాఠశాలలో 820 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- బాలురతో సమానంగా బాలికలు ప్రవేశాలు పొందుతున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం..

వసతిలేని విద్యార్థులు ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని ప్రమాదకరమైన రీతిలో పాఠశాలలకు వస్తున్నారు. ఒక్కోసారి ఇళ్లకు వెళ్లేసరికి చీకటి పడుతోంది. రోజంతా ప్రయాణం చేయడానికే సరిపోతోంది. ఇక చదువుకునేందుకు సమయం లభించడంలేదు. ఇవి ఫలితాలపై ప్రభావం చూపుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతీఆదర్శ పాఠశాల సమీపంలో బీసీ, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, వసతి గృహాల్లో సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పరిధిలో ఉంది



ఆదర్శ పాఠశాలల్లోని వసతి గృహాల్లో సీట్ల సంఖ్య పెంచడం, ఆదర్శ పాఠశాలలున్న చోట బీసీ, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయడం లాంటి అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. వీటికోసం విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వినతులు వస్తున్నాయి. వారి విజ్ఞాపనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. – జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

మోడల్ స్కూళ్లు ఉన్న మండలాలు	
పెగడపల్లి	ధర్మపురి
వెల్గటూర్	మల్యాల
ఇబ్రహీంపట్నం	కొడిమ్యాల
కథలాపూర్	మల్లాపూర్
మెట్‌పల్లి	ఒక్కో స్కూల్‌లో
కోరుట్ల	విద్యార్థుల సంఖ్య
రాయికల్	820
మేడిపల్లి	ఒక్కో వసతి గృహం
గొల్లపల్లి	లో వసతి కల్పన
సారంగాపూర్	100

మిల్లర్ల కొర్రీలు.. పెరుగుతున్న ధాన్యం నిల్వలు



కండ్లపల్లిలో నిలువ ఉన్న ధాన్యం బస్తాలు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని రైతుల పరిస్థితి దీనంగా మారింది. మళ్లీ వరి నారు పోసే సమయం సమీపిస్తున్నా.. యాసంగిలో పండిన ధాన్యం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లోనే ఉంది. తూకం పూర్తి చేసినా.. అన్‌లోడ్ చేసుకోవడానికి మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు ఉండిపోతున్నాయి. మోతీనగర్ కొనుగోలు కేంద్రంలో 2,500 బస్తాలు, తుంగూర్‌లో 2,100, చెర్లపల్లిలో 4వేలు, రంగసాగర్‌లో 2,500, కండ్లపల్లిలో 2,800, కమ్మునూర్‌లో 3,300, నర్సింహులపల్లెలో 5,400, మంగేళలో 600, బీర్‌పూర్‌లో 1,500 బస్తాల్లోని ధాన్యం తూకం వేసి ఉంది. మిల్లులకు తరలించడానికి లారీలు రాకపోవడంతో తూకం వేసిన ధాన్యంలో తరుగు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్లు, నిర్వాహకుల ఇలా చెబుతున్నారు..

'ధాన్యం నిల్వలతో మిల్లు నిండిపోయింది. సంచులు నిల్వచేసుకోవడానికి స్థలం లేదు. బయట లాట్లు పెట్టి అన్‌లోడ్ చేసుకోవడం సులువు కాదు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం పంపించవద్దని చెబుతున్నాం' అంటున్నారు మిల్లర్లు. బీర్‌పూర్ సింగిల్‌విండో సీఈవో అయ్యోరి తిరుపతి మాట్లాడుతూ ధాన్యం తీసుకోవడానికి మిల్లర్లు నిరాకరించడంతో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మిల్లర్లుచాలాఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

అన్ని రంగాల్లో ప్రగతి



మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు పరిశీలిస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: పారిశ్రామిక రంగంలో జిల్లా ప్రగతి సాధించిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, టీఎస్ ఐపాస్ లాంటి విప్లవాత్మక సంస్కరణలు అనేకం చేపట్టామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ విజన్‌తో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. పారిశ్రామిక రంగంలో శరవేగంగా దూసుకెళ్తోందని తెలిపారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను సరళీకృతం చేస్తూ సంస్కరణలు చేపట్టామని అన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో తెలంగాణ పారిశ్రామిక రంగంలో ఊహించని అభివృద్ధి నమోదు చేసిందన్నారు. ఇలా అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు ప్రదర్శించిన ప్రదర్శనలు, వారు చేపట్టిన ఉత్పత్తులను పరిశీలించారు. ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు మకరంద్, లత, ఆర్డీవోలు వినోద్‌కుమార్, మాధురి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, సంక్షేమాధికారి నరేశ్, డీపీవో దేవరాజ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. బుధవారం సాగునీటి దినోత్సవం, గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని చెప్పారు. నియోజకవర్గస్థాయిలో నిర్వహించే సాగునీటి దినోత్సవానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. ఊరూరా చెరువుల పండుగ సందర్భంగా బతుకమ్మలు, బోనాలతో ర్యాలీలుగా చెరువుల వద్దకు తరలివెళ్లి కట్ట మైసమ్మకు పూజలు చేయాలని అన్నారు. ప్రజలు అందరూ అక్కడే భోజనం చేసేలా చూడాలన్నారు. బుధవారం సాయంత్రంలోపు స్థలాలు గుర్తించి శుభ్రం చేయాలని అన్నారు. చెరువుల వద్ద పోలీసు, ఫిషర్‌మెన్, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో టాయిలెట్స్, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ ప్రచార వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, మకరంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృషి ఉంటేనే రుషులవుతారు



అవార్డులు అందిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: కృషి ఉంటేనే రుషులవుతారని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. ఎస్సెస్సీలో వందశాతం ఫలితాలు సాధించిన హెచ్‌ఎంలు, 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్సీతోపాటు జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. విద్యార్థులను ఆణిముత్యాలుగా తయారుచేసేది, వారి భవిష్యత్‌ను నిర్ణయించేది ఉపాధ్యాయులేనన్నారు. డీఈవో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ముందుకు వెళ్లాలన్నారు. నాయకులు రాజు, చంద్రప్రకాశ్‌రెడ్డి, రవి, మహేశ్, జమీల్, పన్నాల లింగారెడ్డి, మచ్చ రాజశేఖర్, జమున, సురేఖ, జయప్రద, వసంత, శ్రీదేవి, గంగాధర్ పాల్గొన్నారు. కాగా, సమగ్ర శిక్షాలోని అన్ని విభాగాల వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రఘోత్తంరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

- గ్రామస్తులను కలిసి వివరాలు సేకరించిన రవీందర్‌రెడ్డి
- బాధితుడితోపాటు హాజరైన సాక్షులు
- నివేదిక తయారు చేసిన పోలీసు అధికారి

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి గ్రామంలో అట్రాసిటీ కేసు విషయంలో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. తక్కళ్లపెల్లి గ్రామంలో ఈనెల 5న కుర్మ రవీందర్‌రెడ్డి తనను కులంపేరుతో దూషించినట్లు బద్దినపెల్లి మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ రవీందర్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తుల సమక్షంలో కేసు విషయంపై విచారణ చేపట్టారు. బాధితుడిని, పలువురు గ్రామస్తులు, సాక్షుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఏఎస్సై ఎండీ అలీమొద్దీన్ ఉన్నారు.

పిచ్చికుక్కల దాడిలో గాయాలు



గాయపడ్డ బాలుడు

జగిత్యాలక్రైం: పట్టణ శివారులోని టీఆర్‌నగర్ గ్రామంలో పిచ్చికుక్కల దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం సాయంత్రం షేక్ ఫరాన్, సలీం, చరణ్‌తోపాటు ఓ మహిళపై పిచ్చికుక్కలు దాడిచేశాయి. వారికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. కాగా, గత రెండు నెలల నుంచి టీఆర్‌నగర్ గ్రామంలో వరుసగా కుక్కలు దాడిచేయడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కట్నం కోసం వేధించిన వారిపై కేసు

జగిత్యాలక్రైం: స్థానిక భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన గంట్యాల జ్యోత్స్నను అదనపు కట్నం కోసం వేధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. గంట్యాల జ్యోత్స్నకు సాయిరాంనగర్‌కు చెందిన గంట్యాల మహేందర్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొద్దికాలంగా భర్త మహేందర్‌తోపాటు, అత్త లత, ఆడబిడ్డ శ్వేత, మరిది శ్రవణ్, ఆడబిడ్డ భర్త రాజశేఖర్ అదనపు కట్నం కోసం ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన సనుగుల రాజవ్వ(65) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రాజవ్వ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సనుగుల రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి

జగిత్యాల: 2023–24 సంవత్సరానికి ఎస్సీ స్టడీ సర్కిల్ 10 నెలల కాలానికి సివిల్ సర్వీసెస్ అప్టిట్యూట్ టెస్ట్, యూపీఎస్సీ ఉచిత రెసిడెన్సియల్ కోర్సులో శిక్షణ ఇస్తుందని, ఇందుకోసం జూలై 9న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3లక్షల కన్నా తక్కువ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు అర్హులన్నారు. ఏదైనా జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగినవారు నోటిఫికేషన్ వెబ్‌సైట్ www.tsstudycircle.co.in ద్వారా ఈనెల 6 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని రాజ్‌కుమార్ సూచించారు.

'బడిబాట'ను విజయవంతం చేయండి



బడిబాట ర్యాలీలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): బడిబాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, విద్యార్థి మానులను భాగస్వాములు చేసి విజయవంతం చేయాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మేడిపెల్లి, భీమారం మండలాల్లో ఆయన పర్యటించారు. బడిబాట కార్యక్రమాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు బృందాలుగా ఇంటింటా తిరిగి విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. మేడిపెల్లి మండలంలో ఇప్పటివరకు 190 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీపీ ఉమాదేవి, ఎంఈవో గంగుల నరేశం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం లారీలకు ప్రమాదం



అదుపుతప్పిన లారీ

కథలాపూర్(వేములవాడ): ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో ప్రమాదానికి గురైంది. గంభీర్‌పూర్ సహకార సంఘం కొనుగోలు కేంద్రంలోని 284 క్వింటాళ్ల ధాన్యాన్ని ధర్మపురి మండలం తక్కళ్లపెల్లి రైస్‌మిల్లుకు లారీలో తీసుకెళ్తున్నారు. కథలాపూర్ శివారులో డ్రైనేజీ వద్ద వెనుక టైర్లు కాలువలో ఇరుక్కుపోవడంతో లారీ ఒక వైపు వంగింది. ధాన్యం బస్తాలు కిందపడ్డాయి. సహకార సంఘం సీఈవో విజయ్ అక్కడకు చేరుకొని రోడ్డుపై ఉన్న ధాన్యం బస్తాలను వేరే లారీలో కూలీలతో ఎక్కించి కొనుగోలు కేంద్రానికి తరలించారు.



బోల్తాపడ్డ ధాన్యం లారీ

ధాన్యం లారీ బోల్తా

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కోజన్ కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం కేశాపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన 610 ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేశారు. అయితే, లారీ క్లీనర్ అజాగ్రత్తగా లారీ నడుపడంతో అది బోల్తాపడింది. లారీలోని ధాన్యం బస్తాలు పక్కనే ఉన్న కాలువలో పడిపోయాయి. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

యువజన నాయకులే పునాది

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అధికార ప్రతినిధులతో లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: యువజన నాయకులే కాంగ్రెస్‌కు పునాదిలాంటివారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని అడ్లూరి నివాస కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన యువజన కాంగ్రెస్ అధికారి ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మపురి మండలం దోనూర్ గ్రామానికి చెందిన దాసరి పురుషోత్తం, ఎండపెల్లి మండలం రాజారం పెల్లికి చెందిన గాజుల వినయ్‌గౌడ్, ధర్మారం మండలం చింతలపల్లెకు చెందిన నారా మహేందర్‌ను అధికార ప్రతినిధులుగా ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింహరాజు ప్రసాద్, నాయకులు రాందేని మొగిలి, పూదరి రమేశ్, గెల్లు శ్రీనివాస్, పోశయ్య, ప్రశాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపే ప్రజలు



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంలో కేసీఆర్ సర్కార్ విఫలమైందని, వాటిని నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. లింగంపేటలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. లింగంపేటను బల్దియాలో విలీనం చేసినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదని విమర్శించారు. తాగునీటి కోసం ప్రజలు బావులపైనే ఆధారపడుతున్నారని అన్నారు. మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌కు అభ్యర్థులు లేరనడం విడ్డూరంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. నాయకులు ధర్మయ్య, బండ శంకర్, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, గుండ మధు, నేహాల్, బీరం రాజేశ్ ఆకుల నాగరాజు పాల్గొన్నారు.